

దసరాకు ఆర్టీసీ సిద్ధం

దసరా సందర్భంగా అక్టోబర్ 1 నుంచి 11 వరకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. 8లో▸



పత్తికి సూక్ష్మపోషకాలు తప్పనిసరి 8లో▸

పత్తి మొక్కలకు ప్రధాన మూలకాలతోపాటు సూక్ష్మపోషకాలు తప్పనిసరి. పంట ఎదుగుదల, కాయల అభివృద్ధి, నాణ్యతకు దోహదపడుతాయి.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/25.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఆదివాసీ ఆణిముత్యం కొట్నాక్ జంగు



జంగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..

నార్నూర్: ఆదివాసీ ఆణిముత్యం, గోండి లిపి పండితుడు కొట్నాక్ జంగు మృతి ఆదివాసీ సమాజానికి తీరనిలోటని నంగారాభేరి జిల్లా అధ్యక్షుడు జాదవ్ సంజీవ్ నాయక్ అన్నారు. మండలంలోని గుంజాల గ్రామంలో జంగు చిత్రపటానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. గోండిలిపిలో ఒకటి, రెండో వాచకాలను రాసిన మేధావి జంగు అని కొనియాడారు. ఇందులో కాంగ్రెస్ నాయకుడు బ్రిజులాల్, సావీందర్ తదితరులున్నారు.

నేడు ట్రైకార్ చైర్మన్ జిల్లా పర్యటన

కైలాస్‌నగర్: తెలంగాణ షెడ్యూల్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీ ట్రైకార్) రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్ సోమవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరి 11.30 గంటలకు గుడిహత్నూర్ చేరుకుంటారు. మండల కేంద్రంలోని గిరిజన రైతులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అక్కడి నుంచి బయల్దేరి కేస్లాపూర్ చేరుకొని నాగోబాను దర్శించుకుంటారు. ఒంటిగంటకు ఇంద్రవెల్లికి చేరుకొని రైతులతో సమావేశమవుతారని, 2.15 గంటలకు ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. 3.30 గంటలకు మండల కేంద్రంలోని పల్లిపట్టి, నాప్‌కిన్స్, నువ్వుల లడ్డూ తయారీని పరిశీలించనున్నట్లుగా వివరించారు.

అపోహలు వద్దు.. సర్వేకు సహకరించండి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు ఆక్రమణకు గురైందనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. ఈ సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ సర్వే చేస్తున్నామే తప్పా ప్రస్తుతం ఉన్నటువంటి భవన నిర్మాణాలను కూల్చివేసే ఉద్దేశం లేదని తెలిపారు. పట్టణ ప్రజలు విషయాన్ని గమనించి సర్వేకు సహకరించాలంటూ ఆయన ఓవీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రజలు అపోహలకు గురి కాకుండా సర్వేకు సహకరించాలని ఆయన కోరారు.



కలెక్టర్, వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఐసీఎంఆర్ బృందం సభ్యులు (ఫైల్)

శిశు సంకల్పం

- 'పసి' మరణాలు తగ్గించడమే లక్ష్యం
- పైలట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్
- సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసేలా చర్యలు
- మూడేళ్ల పాటు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు

జిల్లాలో 2023లో శిశు మరణాలు: 149

2024 ఆగస్టు వరకు శిశు మరణాలు: 52

ఆదిలాబాద్‌టౌన్: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన ఆ తల్లికి కన్న మురిపం ఎంతోకాలం ఉండడం లేదు. వివిధ కారణాలతో పసికందులు అనతికాలంలోనే తనువుచాలిస్తున్నారు. ఫలితంగా ఆ తల్లులు గర్భశోకంతో తల్లడిల్లిపోతున్నారు. జిల్లాలో శిశు మరణాలు పెరుగుతూనే ఉన్నాయి. వైద్యారోగ్య శాఖ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ మరణాల రేటు తగ్గని పరిస్థితి. దీంతో కేంద్ర ప్రభుత్వం నవజాత శిశు మరణాలు తగ్గించేందుకు సంకల్ప్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తంగా పది జిల్లాలను ఎంపిక చేయగా, అందులో ఆదిలాబాద్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమాన్ని మూడేళ్లపాటు నిర్వహించనున్నారు. ప్రస్తుతం వెయ్యి మంది శిశువులు జన్మిస్తే అందులో 11 మంది వివిధ కారణాలతో మృత్యువాత పడుతున్నారని అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ఈ మరణాలు ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. పదికి లోపు మరణాలు తగ్గించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

పిట్టల్లా రాలుతున్న శిశువులు..

జిల్లాలో నవజాత శిశువులు పిట్టల్లా రాలుతున్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్లలోపు వారి మరణాలు పెరుగుతూనే ఉన్నాయి. వైద్యారోగ్యశాఖ అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వడం లేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఏజెన్సీ ప్రాంతాల్లోని చాలా మంది గర్భిణుల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉంటుంది. ఐరన్ లోపంతో ఇబ్బందులు పడే వారు అధికం. ఈ క్రమంలో



నవజాత శిశువులను పరిశీలిస్తున్న ఐసీఎంఆర్ బృందం సభ్యులు (ఫైల్)

ఎక్కువ మంది చిన్నారులు బరువు తక్కువగా పుట్టడంతో మరణాల సంఖ్య పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. శ్వాస తీసుకోకపోవడం, జన్యు సమస్యలు, వివిధ రుగ్మతలతో జన్మించిన చిన్నారులు నెలలు గడవక ముందే ఎక్కువగా మరణిస్తున్నారని పిల్లల వైద్య నిపుణులు చెబుతున్నారు. గర్భం దాల్చిన తర్వాత సరైన పోషకాహారం తీసుకోకపోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం, రక్తహీనత తదితర కారణాలతో ఈ ప్రభావం పుట్టబోయే బిడ్డలపై పడుతోంది. 2023–24 సంవత్సరంలో జిల్లాలో 12,575 మంది శిశువులు జన్మిస్తే, 149 మంది మరణించారు. ఈ ఏడాది ఆగస్టు వరకు 5,095 మంది శిశువులు జన్మిస్తే, 52 మంది తనువు చాలించడం గమనార్హం.

శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం..



జిల్లాలో నవజాత శిశు మరణాలు తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇందులో భాగంగా ప్రభుత్వం సంకల్ప్ కార్యక్రమానికి జిల్లాలో శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం మూడేళ్ల పాటు కొనసాగనుంది. కేంద్ర ప్రభుత్వం మిలింద గేట్, ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో జిల్లాలో సర్వేలు చేపట్టి మరణాలు తగ్గించేందుకు ఇప్పటికే ప్రణాళిక సిద్ధమైంది. సిబ్బంది నియామకాలను చేపడుతున్నారు. పౌష్టికాహార లోపం, నెలలు నిండక ముందే పుట్టడం, జన్యు సమస్యలు, బరువు తక్కువగా ఉన్న నవజాత శిశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వెయ్యి మందికి గాను 11 మరణాలు ఉండగా, వాటిని 10కి లోపు తీసుకురావడమే ఈ కార్యక్రమ ఉద్దేశం.

– డాక్టర్ వైసీ శ్రీనివాస్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

వెయ్యి మందిలో 11 మంది మృత్యుఒడికి..

జిల్లాలో నవజాత శిశువులతో పాటు ఐదేళ్లలోపు చిన్నారులు మరణిస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఈ మరణాల రేటు ఎక్కువగా ఉంది. దేశంలో వెయ్యి మంది శిశువులకు గాను 26 మంది మరణిస్తుండగా, రాష్ట్రంలో 21 మంది, జిల్లాలో 11 మంది శిశు మరణాలు సంభవిస్తున్నాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కానీ అనధికారికంగా అంతకంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మరణాలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం, మిలిందగేట్, ఐసీఎంఆర్ సంస్థలు జిల్లాలో సంకల్ప్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఆగస్టు 17న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో గర్భిణులు, బాలింతల వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మరణాల నివారణకు చేపట్టే విషయాలపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశలు, వైద్యాధికారుల ద్వారా వివరాలు సేకరిస్తున్నారు.

పంటల బీమా ఏది?



తాంసి మండలంలో భారీ వర్షాలకు నష్టపోయిన పత్తి పంట(ఫైల్)



ఈ ఫొటోలోని రైతు కుచ్చిరాం. భీంపూర్ మండలంలోని గుబిడి గ్రామం. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ఈయన సాగు చేసిన ఐదెకరాల్లో పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. దాదాపు రూ.లక్ష వరకు పెట్టుబడి నష్టపోయాడు. పంటల బీమా పథకం అమల్లో ఉంటే తనకు ప్రయోజనం దక్కేదని వాపోతున్నాడు. ఇతనొక్కడే కాదు.. పంట నష్టపోయిన జిల్లాలోని రైతులందరిదీ ఇదే పరిస్థితి.

- హామీ అమలు మరిచిన కాంగ్రెస్ సర్కారు
- వానాకాలం ముగుస్తున్నా స్పష్టత కరువు
- జిల్లాలో భారీగా పంట నష్టం
- ఆందోళనలో రైతులు

ఇచ్చోడ: గతంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంటల బీమా పథకాన్ని అమలు చేసేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు అమలుతో ఈ పథకాన్ని ఎత్తేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి పునరుద్ధరిస్తామని, అలాగే ప్రీమియం సైతం చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించింది. అయితే అధికారంలోకి దాదాపు ఏడాది సమీపిస్తోంది. మరోవైపు వానాకాలం పంటల సీజన్ ముగుస్తున్నా పథకం అమలుపై స్పష్టత కరువైంది. ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. రైతులు భారీగా నష్టపోయారు. ఒకవేళ పంటల బీమా అమలు చేసి ఉంటే

జిల్లాలో ఈ సీజన్‌లో పంటనష్టం వివరాలు

పంట	నష్టం(ఎకరాల్లో)
పత్తి	1,609
సోయా	234
ఇతర పంటలు	118
మొత్తం	1,961

తమకు ప్రయోజనం దక్కేదని బాధిత రైతులు పేర్కొంటున్నారు.

జిల్లాలో సాధారణకు మించిన వర్షం

జిల్లాలో జూన్ 1నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 853.4 మిల్లీమీటర్లు కాగా కురిసింది మాత్రం 991.14 మిల్లీమీటర్లు. సాధారణంతో పోల్చితే ఇది 16 శాతం అధికం. అధిక వర్షాల కారణంగా జిల్లాలోని ఏడు మండలాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ సీజన్‌లో 1,961 ఎకరాల్లోనే పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో దాదాపు ఐదు వేల ఎకరాలకుపైగా ఉన్నట్లు సమాచారం.

పంటల బీమా అమలు చేయాలి



పంటల బీమా పథకం అమలులో ఉంటే ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట నష్టపోయిన రైతులకు ప్రయోజనం చేకూరేది. ఈ పథకం నిలిపివేయడం ద్వారా ఏటా వేలాది మంది రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈ పథకాన్ని త్వరగా అమలు చేసి అన్నదాతను ఆదుకోవాలి.

– చెన్నుల గంగారెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర నాయకుడు

జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్ అంశాలు ఇవే..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాస్థాయి సైన్స్‌ఫేర్, జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించిన అంశాలను డీఈవో ప్రణీత ఆదివారం ప్రకటించారు. ప్రధాన అంశంగా నిరంతర అభివృద్ధి కోసం శాస్త్ర సాంకేతిక రంగాలు, ఉప అంశాలుగా ఆరోగ్యం, ఆహారం, పరిశుభ్రత, రవాణా, కమ్యూనికేషన్, సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి విపత్తుల నిర్వహణ, గణిత మోడలింగ్ కాంపిటేషనల్ థింకింగ్, వ్యర్థ పదార్థాల వినియోగం, నైపుణ్యాలు అభివృద్ధి పర్చే అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలను రూపొందించాలని సూచించారు. ఈ మేరకు సైన్స్ ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు సైన్స్‌ఫేర్‌లో పాల్గొనేలా చూడాలని తెలిపారు. అక్టోబర్ చివర, నవంబర్ మొదటి వారంలో నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు వివరించారు. విషయాన్నిఉపాధ్యాయులు గమనించాలని సూచించారు.

పల్లెకు ఊరట

- ఎట్టకేలకు రూ.5.05 కోట్ల కేంద్ర నిధులు విడుదల
- జీపీల్లో పెండింగ్ బిల్లుల చెల్లింపునకు దోహదం

జిల్లాలోని గ్రామపంచాయతీలు: 473

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లు : 1505

కైలాస్‌నగర్: ప్రత్యేక అధికారుల పాలనలో నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఊరట కల్పించింది. ఎనిమిది నెలలుగా ఆర్థికంగా సతమతం అవుతున్న పంచాయతీలకు ఎట్టకేలకు నిధులను విడుదల చేసింది. పాలకవర్గాల గడువు ముగిసినప్పటి నుంచి ఖజానాలో చిల్లిగవ్వ లేక తిప్పలు పడుతున్న జీపీలకు ప్రయోజనం చేకూర్చేలా నిధులను విడుదల చేసింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ల వేతనాలు, కరెంటు బిల్లులు, పంచాయతీ ట్రాక్టర్లకు సంబంధించి ఈఎంఐల చెల్లింపునకు ఇవి దోహదపడనున్నాయి.

ఎనిమిది నెలలుగా నిధుల కటకట..

పంచాయతీ పాలకవర్గాల గడువు ఈ ఏడాది ఫిబ్రవరి 1తో ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన అప్పటి నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నయాపైసా విడుదల కాలేదు. దీంతో జీపీల్లో ప్రత్యేక పనులను చేపట్టే విషయం అటుంచితే.. కనీసం



మావల గ్రామపంచాయతీ కార్యాలయం

మౌలిక సదుపాయాలు సైతం సమకూర్చుకోలేని దుస్థితి. ఆర్థిక వనరులున్న మేజర్ పంచాయతీలను మినహాయిస్తే మెజార్టీగా ఉన్న చిన్న పంచాయతీలు కరెంటు బిల్లులు, మల్టీపర్పస్ కార్మికులకు వేతనాలు సైతం, ట్రాక్టర్లు, డోజర్, ట్రాలీలకు సంబంధించిన ఈఎంఐలు చెల్లించలేని దుస్థితి. నెలల తరబడి ప్రభుత్వాలు నిధులు విడుదల చేయకపోవడంతో వాటిని ఎలా చెల్లించాలో తెలియక కార్యదర్శులు తలలు పట్టుకున్నారు. జనరల్ ఫండ్ ఉపయోగించే అవకాశం లేక, ఏం చేయాలో తెలియక తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఎట్టకేలకు నిధులు విడుదల..

ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆలస్యంగానైనా నిధులను విడుదల చేసింది. జిల్లాలో 473 గ్రామపంచాయతీలకు గాను రూ.5 కోట్ల 5లక్షల 30వేల 479 నిధులను విడుదల చేసింది. వీటిని జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు కేటాయించనుంది. మంగళవారంలోగా ఖాతాల్లో జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని 254 పంచాయతీల్లో ట్రాక్టర్లు, డోజర్లు, ట్రాలీలకు సంబంధించి ఈఎంఐ బకాయిలు రూ.71లక్షల 64వేల 947 పేరుకుపోయాయి. అలాగే పంచాయతీ పరిధిలోని అన్నిరకాల విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి బకాయిలు రూ.42లక్షల 66వేలు పేరుకుపోయాయి. మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ల వేతనాలు రూ.1కోటి 51లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు విడుదల అయిన నిధులతో ఆయా సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

పంచాయతీ ఖాతాల్లోకి నిధులు..

గ్రామపంచాయతీల్లో విద్యుత్ బిల్లులు, ఈఎంఐలు, మల్టీపర్పస్ హెల్త్‌వర్కర్ల వేతనాలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. మంగళవారంలోగా సంబంధిత పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తాం.

– ఎస్.శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి

పీఆర్టీయూ జిల్లా కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా కృష్ణకుమార్, ప్రధానకార్యదర్శిగా నర్సింహస్వామి



ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా నూతన కార్యవర్గ ప్రతినిధులు

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్టీయూ జిల్లా ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ఇందులో కృష్ణకుమార్ ప్యానల్ ఘన విజయం సాధించింది. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. పరిశీలకులుగా పీఆర్టీయూ మాసపత్రిక సంపాదకులు ఇన్నారెడ్డి, అధికారులుగా నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేందర్‌బాబు, రమణారావు వ్యవహరించారు. మధ్యాహ్నం ఎన్నికలు నిర్వహించారు. సాయంత్రం కౌంటింగ్ చేపట్టి ఫలితాలు వెల్లడించారు. మొత్తం 99 ఓట్లు ఉండగా, అన్ని పోలయ్యాయి. అధ్యక్ష బరిలో కృష్ణకుమార్, కుడాల రవీందర్‌రెడ్డి తలపడగా 15 ఓట్లతో కృష్ణకుమార్ విజయం సాధించారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఇందులో నాయకులు బాల్‌చందర్, ప్రతాప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం..

అధ్యక్షుడిగా కె.కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహస్వామి, అసోసియేట్ అధ్యక్షులుగా బి.గంగయ్య, అశ్విన్‌కుమార్, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా సులోచనరాణి, ఉపాధ్యక్షులుగా వెంకట్‌రాంరెడ్డి, సంతోష్‌కుమార్, నర్సయ్య, గంగాధర్, టి.సదానందం, మహిళా ఉపాధ్యక్షులుగా కృష్ణవేణి, కార్యదర్శులుగా నీలం వెంకట్, సీహెచ్.సంతోష్‌కుమార్, మదన్‌లాల్, సూరాజి, శ్రీకాంత్, మహిళా కార్యదర్శిగా అరుణ ఎన్నికయ్యారు.

ఉమ్మడి ఆదిలాబాద్ రిజిస్ట్రార్‌గా రవీందర్‌రావు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్‌గా ఎం.రవీందర్‌రావు నియామకం అయ్యారు. ఇదివరకు డీఆర్‌గా పనిచేసిన సీహెచ్ అశోక్‌కుమార్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీ చేసిన ప్రభుత్వం ఆ స్థానంలో హైదరాబాద్ దక్షిణ డీఆర్‌గా ఉన్న రవీందర్‌రావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

సవాళ్లను అధిగమించేందుకు చెస్ దోహదం





విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో జిల్లా గిరిజన క్రీడల అధికారి, నిర్వాహకులు

ఆదిలాబాద్: మనిషి జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను అధిగమించేందుకు చెస్ క్రీడ దోహదపడుతుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి అన్నారు. అండర్–15 జిల్లాస్థాయి బాలబాలికల ఎంపిక పోటీలను మావలలోని శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ స్వామి మాట్లాడుతూ ఎంపిక పోటీలకు 70 మంది హాజరైనట్లు వెల్లడించారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు అక్టోబర్ 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇందులో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఈటీలు వినోద్, సాయి, నాగరెడ్డి, తదితరులున్నారు.

క్లుప్తంగా

మద్యం మత్తులో ఆత్మహత్య

భైంసారూరల్: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని పాంగ్రి గ్రామానికి చెందిన రాంకూరే గణేశ్ (26) గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ప్రతిరోజు మద్యం తాగి కుటుంబీకులతో గొడవపడేవాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఇంటికివచ్చి కుటుంబీకులతో గొడవపడి చచ్చిపోతా అంటూ వెళ్లిపోయాడు. అతని కోసం వెళ్లగా గ్రామశివారులో చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. గణేశ్‌ను వెంటనే భైంసా ఏరియాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. భార్య గంగాసాగర ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడకు చెందిన లింగాల కిరణ్ కుమార్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్‌రూరల్ ఏఎస్సై మారుతి కథనం ప్రకారం.. కిరణ్‌కుమార్ (35) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొన్నినెలలుగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో భార్యతో గొడవపడేవాడు. నెల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం తండ్రి శ్రీనివాస్ గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. భార్య శిరీష ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి గాయాలు

తిర్యాణి:మండలంలోని బోడగూడలో ఎలుగుబంటి దాడిలో మేకల కాపరికి తీవ్ర గాయాలయ్యాయి. గోపెర ఫారెస్టు సెక్షన్ అధికారి మల్లయ్య కథనం ప్రకారం.. గిన్నెదరి రేంజ్ పరిధిలోని గోపెర సెక్షన్‌కు, కైరిగూడ బీట్ పరిధిలోని బోడగూడ అటవీప్రాంతంలో అదే గ్రామానికి మేకల కాపరి పంద్రం బగ్గు తన మేకలను మేపి శనివారం సాయంత్రం ఇంటికి వస్తుండగా పిల్లలతో కూడిన ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. ఈ దాడిలో బగ్గు కాలికి తీవ్రగాయమైంది. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితుడికి నష్టపరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

పెంచికల్‌పేట్: మండలంలోని లోడుపల్లి ప్రధాన రహదారిలో అక్రమంగా తరలిస్తున్న పశువులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం..కొటాల మండల కేంద్రంతో పాటు బెజ్జూర్ మండలంలోని సలుగుపల్లి, మర్థిడి గ్రామాల నుంచి అనుమతి లేకుండా నాలుగు వాహనాల్లో 36 పశువుల ను తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించారు. వాహనాలను సీజ్‌చేసి చేసి, పశువులను అక్రమంగా తరలిస్తున్న జగిత్యాల జిల్లాలోని చిన్నకోడూరు, గొల్లపల్లి గ్రామాలకు చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దసరాకు ఆర్టీసీ సిద్ధం

- అక్టోబర్ 1 నుంచి 11 వరకు ప్రత్యేక బస్సులు
- ప్రయాణికుల రద్దీకనుగుణంగా ఏర్పాట్లు
- ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో 412 సర్వీసులు



ఆదివారం మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

మంచిర్యాలఅర్బన్: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అక్టోబర్ 1 నుంచి 11వ తేదీ వరకు నడిపేందుకు సన్నద్ధమవుతుంది. ఆయా ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. స్కూల్, కళాశాలలకు పండుగ సెలవులు ఉన్నందున ఊళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇంకోవైపు ట్రాక్ మరమ్మతు నేపథ్యంలో రైళ్ల బంద్‌తో బస్సులను ఆశ్రయించే అవకాశాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ రీజియన్‌లో ఆయా డిపోల నుంచి 412 బస్సులను జేబీఎస్ (హైదరాబాద్ నుంచి) ప్రత్యేకంగా నడపడానికి సన్నాహాలు చేస్తోంది.

మంచిర్యాల నుంచి ఎక్కువ బస్సులు..

పండుగ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల నుంచి ఎక్కువగా బస్సులు నడపనున్నారు. రీజియన్ వారీగా 412 బస్సులు నడపనుండగా మంచిర్యాల నుంచి 125 బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. నిర్మల్ నుంచి 120, ఆదిలాబాద్ 78, ఆసిఫాబాద్ 73, భైంసా 11, ఉట్నూర్ 05 బస్సులు నడపనున్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపార, చదువుల నిమిత్తం వెళ్లినవారు స్వగ్రామాలకు పయనం కానున్నారు. పండుగ వేళ ట్రాక్ మరమ్మతు పేరిట కాగజ్‌నగర్, పుష్పుల్, రామగిరి, ఇంటర్‌సిటీ రైళ్లు రద్దు చేశారు. గోరఖ్‌పూర్-కొచ్చువెల్లి, ఎర్నాకులం, శ్రీవైష్ణోదేవి-చెన్నై, కాజీపేట్-పుణె పలు వీక్లీరైళ్లు రద్దు, దారి మళ్లింపు చేశారు. ఇంకోవైపు మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళల రద్దీ పెరిగింది. ఈనేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు టికెట్లు రిజర్వేషన్లు చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో నడిచే బస్సుల కంటే ప్రత్యేక బస్సులు నడిపి ఆదాయం సమకూర్చునేందుకు ఆర్టీసీ సిద్ధమవుతోంది. జేబీఎస్‌లో ప్రయాణికుల సమాచారం కోసం ఆయా డిపోల నుంచి ప్రత్యేక సిబ్బందిని నియమించారు.

గతేడాదికంటే ఎక్కువ..

ఆర్టీసీ గతేడాది కంటే ఈ ఏడాది పండుగకు అదనంగా బస్సులు నడపనుంది. గతేడాది సెప్టెంబర్ 13 నుంచి 22 వరకు 404 బస్సులు నడపగా, ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి 11 వరకు 412 బస్సులు ద్వారా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయనున్నారు. గతేడాది మంచిర్యాల నుంచి 116, నిర్మల్ నుంచి 108 ఆదిలాబాద్ నుంచి 87 బస్సులు నడపగా ఈ ఏడాది కాస్త బస్సుల సంఖ్య పెంచారు.

డిపోల వారీగా..అక్టోబర్ 1నుంచి 11 తేదీ వరకు

తేదీ	ఆదిలాబాద్	భైంసా	నిర్మల్	ఉట్నూర్	మంచిర్యాల	ఆసిఫాబాద్
1	6	1	12	0	15	6
2	2	0	5	0	4	3
3	3	0	5	0	5	3
4	2	0	5	0	4	3
5	12	2	16	1	18	11
6	5	1	8	1	6	6
7	4	0	5	0	7	3
8	3	0	5	0	4	3
9	12	2	16	1	18	11
10	13	2	18	1	20	11
11	16	3	23	1	24	13

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా..



దసరా పండుగ వేళ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సులు నడపనుంది. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ బస్సులు నడపనున్నాం. ప్రయాణికులకు ఇక్కట్లు లేకుండా ఆయా బస్‌స్టేషన్ల వద్ద సమాచారం అందించేందుకు ప్రత్యేక సిబ్బంది నియమించాం. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

– సోలోమాన్, ఆర్టీసీ రీజియనల్ మేనేజర్, ఆదిలాబాద్

ఆర్కే 5 గనిపై చోరీ

- ట్రంక్‌పెట్టెల్లో ఫోన్లు, నగదు అపహరణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిపై శనివారం రాత్రి చోరీ జరిగింది. గనిపై కార్మికులు తమ సామగ్రిని భద్రపర్చుకునే ట్రంక్ పెట్టెలను పగులగొట్టి దొరికినకాడికి దొంగలు దోచుకెళ్లారు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకుని కార్మికులు వచ్చేసరికి తాళాలు పగులగొట్టి తెరిచి ఉన్నాయి. రూ.3 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు, రూ.10 వేల నగదు, కొన్ని బైక్ కీలు చోరీకి గురయ్యాయని బాధితులు గని అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎస్‌అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే: ఏఐటీయూసీ

ఎస్‌అండ్‌పీసీ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ చోరీలు పునరావృతం అవుతున్నాయని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని డెప్యూటీప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ షేక్ బాజీసైదా సందర్శించారు. కార్మికులకు పటిష్టమైన లాకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఫిట్ సెక్రెటరీగునిగంటి నర్సింగరావు, నాయకులు అఫ్రోజ్ ఖాన్,నాగుల రాజయ్య, సతీశ్, రమేశ్ ఉన్నారు.



పగులగొట్టి ఉన్న ట్రంక్ పెట్టెలు

పటిష్ట చర్యలు చేపట్టాలి: టీబీజీకేఎస్

గనులపై రక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కార్మికులతో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డెప్యూటీ జనరల్ సెక్రెటరీ బండి రమేశ్, నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, దుర్గం రవి, ముస్త్యాల రమేశ్, గొర్ల సంతోశ్, గోపి నాయక్, ఎండీ లాల ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



కాసిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన అపూర్వ సమ్మేళనానికి వారు హాజరయ్యారు. 25 ఏళ్ల తర్వాత ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ సీఐడీ అడిషనల్ ఎస్పీ రవికుమార్ హాజరై మాట్లాడారు. మానవీయ సంబంధాలు మెరుగుపడాలంటే ఇలాంటి సమ్మేళనాలు ఎంతో అవసరమన్నారు. – కాసిపేట

రాంనరేశ్‌కు గవర్నర్ ప్రశంస

- జిల్లా ఉపాధ్యాయుడికి అభినందన లేఖ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా సాహితీ ఖిల్లాగా పేరు గాంచింది. తాజాగా జిల్లాకు చెందిన కవి, రచయిత, సాహితీవేత్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వకుళాభరణం రాంనరేశ్ కుమార్ సాహితీకళకు గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ ప్రశంస దక్కింది. భైంసా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఈయన 'వినరా భారతీయ వీరచరిత్ర..పేరిట దేశ చారిత్రక వీరుల కథాంశాలను శతక పద్య రూపక పుస్తకంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఇది ప్రచురణ దశలో ఉంది. త్వరలో విడుదల కానున్న పుస్తకాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి, గవర్నర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం దృష్టికి తీసుకెళ్లారు. ఈ పుస్తకాన్ని ఆయన చదివి ప్రశంసించారు. సాహితీ నైపుణ్యం, జాతీయవాద చరిత్రపై రాంనరేశ్‌కు ఉన్న మక్కువపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రెండురోజుల క్రితం అభినందన లేఖను పంపారు. రాంనరేశ్ గతంలో అనేక కథాంశాలతో పలు కవితలను రచించారు.



పద్య శతక గ్రంథం ముఖచిత్రం ఇదే

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు

- నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం
- కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు

ఆదిలాబాద్‌టౌన్: జల్సాలకు అలవాటుపడి బైక్‌లు చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను టూటౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు కథనం ప్రకారం..ఈనెల 22న రాత్రి సమయంలో ఖుర్షీద్‌నగర్ కాలనీలోని అరార పెట్రోల్‌బంక్ నుంచి తన బైక్ చోరీకి గురైనట్లు తిర్పెల్లికి చెందిన బాధితుడు షేక్ అజీమ్ అహ్మద్ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేశారు. ఎస్సై విష్ణుప్రకాశ్, కానిస్టేబుళ్లు నరేశ్, నరేందర్, సుధాకర్‌రెడ్డి, సంజీవ్, రమేశ్, గోపాల్, హెడ్‌కానిస్టేబుల్ మదన్, రమణయ్య ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ ఎదుట వాహనాలు తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి బైక్ అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. నేరడిగొండ మండలం బుగ్గారం తండాకు చెందిన బుక్య కృష్ణరాథోడ్ దొంగతనానికి పాల్పడినట్లు తెలిపాడు. ఆదిలాబాద్‌లో 2, నిర్మల్‌లో 1, భైంసాలో 1 బైక్‌లు దొంగతనం చేసినట్లు పేర్కొన్నారు. ఇదివరకు కరీంనగర్‌లో 3, నిజామాబాద్‌లో 1, మెదక్ జిల్లా రామాయంపేటలో 1, కామారెడ్డిలో 1, నిర్మల్ జిల్లా కడెం, భైంసా, నిర్మల్‌లో ఒక్కొక్కటి చొప్పున బైక్‌లు చోరీ చేసినట్లు తెలిపారు. బైక్‌ల దొంగతనం కేసులో ఇప్పటికే మూడుసార్లు జైలుకు వెళ్లినట్లు వివరించారు.



నిందితుడు, స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ

బాల్‌బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర జట్టుకు తృతీయ బహుమతి



తృతీయ బహుమతి అందుకుంటున్న రాష్ట్ర జట్టు

రెబ్బెన(ఆసిఫాబాద్): హర్యానా రాష్ట్రంలోని రోతక్ జిల్లాలో జరిగిన 43వ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తృతీయస్థానంలో నిలిచినట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన దామర ప్రేమ్‌దీప్ రాష్ట్రజట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించటంతోపాటు పోటీల్లో అద్భుత ఆటతీరును ప్రదర్శించి జట్టు గెలుపు కోసం కృషి చేసినందుకుగాను బెస్ట్ టాప్ ఫైవ్ ప్లేయర్‌లో బెస్ట్ అవార్డును సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రేమ్‌దీప్..2023లో కర్ణాటకలో జరిగిన సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. బెస్ట్ ప్లేయర్ అవార్డు పొందిన సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రేమ్‌దీప్‌ను అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.తిరుపతి, ఏరియా జీఎం శ్రీనివాస్, సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ తిరుపతి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సింగం అభినందించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



తల్లికి చిన్నారిని అప్పగిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని శ్రీపతినగర్‌కు చెందిన చిన్నారి సన్‌ఫిర్దోశ్(5) ఆదివారం ఉదయం కిరాణం దుకాణానికి వెళ్లింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు 100 డయల్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఎస్సై ఆధ్వర్యంలో ఆరు పోలీసు బృందాలు గాలింపుచర్యలు చేపట్టారు. దీపక్‌నగర్ ఏరియాలో చిన్నారి సుమారు మూడున్నర గంటల తర్వాత కనిపించింది. ఎస్సై రాజశేఖర్ ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

పత్తికి సూక్ష్మపోషకాలు తప్పనిసరి

- మొక్కల ఎదుగుదలకు కాంప్లెక్స్ ఎరువులు వాడాలి
- జింక్, బోరాన్, మెగ్నీషియం అవసరం



పత్తిలో జింక్ లోపంతో రంగు మారిన ఆకులు



బోరాన్ లోపంతో ఎర్రబారిన పత్తి

చెన్నూర్‌రూరల్: పత్తి పంటకు అందించే ప్రధాన మూలకాలు లేదా పోషకాలు నత్రజని (యూరియా, డీఏపీ, కాంప్లెక్స్), పాస్పరస్(పి) సింగిల్ పాస్ఫేట్, పొటాష్ (మ్యూరేట్‌ఆఫ్ పొటాష్, మల్టికె కాంప్లెక్స్ అందిస్తారు. వీటితోపాటు మొక్కల ఎదుగుదల, కాయల అభివృద్ధి, పత్తి నాణ్యత, దిగుబడి పెరగడానికి జింక్, బోరాన్, మెగ్నీషియం తదితర సూక్ష్మపోషకాలు అందించడం తప్పనిసరని చెన్నూర్ ఏవో మార్క్‌గ్లాడ్‌స్టన్ సూచించారు.

జింక్: జింక్ లోపంతో విత్తనాలు విత్తిన మూడు వారాల తర్వాత మొక్క మధ్య ఆకులపై కనిపిస్తుంది. ఆకుల ఈనెలు, ఆకుపచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. గోధుమరంగు మచ్చలు ఆకుల చివర్ల నుంచి మొదలుకు వ్యాపిస్తాయి. ఆకుచివర్లు ఎండిపోతాయి. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి ముడతలు పడి కణుపుల మధ్య దూరం తగ్గిపోతుంది. మొక్కలు చిన్నవిగా గుబురుగా కనిపిస్తాయి.

నివారణ చర్యలు: జింక్ లోపం ఉండకుండా ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్‌సల్ఫేట్ వేయాలి. పైరుపై జింక్‌లోపం కనిపించగానే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి ఐదు రోజుల వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

బోరాన్: మొక్క జీవనక్రియలో బోరాన్ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. మొక్కలో సున్నం, పొటాష్ పోషకాలను క్రమబద్ధీకరిస్తుంది. మొక్క సున్నాన్ని సక్రమంగా వినియోగించుకోవడానికి బోరాన్ అవసరం ఉంటుంది. సున్నంపాటు ఎక్కువగా ఉన్న నేలల్లో వర్షాభావ పరిస్థితుల్లో అధిక వర్షపాతం ఉన్నప్పుడు ఈ లోపం కనిపిస్తుంది. ఆకులు, కాడలు ఒకే రీతిలో ఊడక కొంత దళసరిగాను, కొంత పలుచగాను ఉండి అక్కడక్కడ గుండ్రటి మచ్చలు ఏర్పడుతాయి. పూత, మొగ్గ దశలో ఎండిపోవడం, చిన్నకాయలు రాలిపోవడం మొక్కలు గిడసబారి మొదలుపై పగుళ్లు ఏర్పడుతాయి. కాండం సరిగా అభివృద్ధి చెందక ఆకారం కోల్పోయి, పగుళ్లు ఏర్పడుతాయి.

నివారణ చర్యలు: బోరాన్ లోపించకుండా ఉండేందుకు ఎకరాకు 4 కిలోల బోరాక్స్ దుక్కిలో వేయాలి. బోరాన్ లోపం మొక్కలపై కనిపిస్తే పైరు విత్తిన 60, 90 రోజుల తర్వాత లీటరు నీటికి 1.5 గ్రాముల బోరాక్స్ వారం వ్యవధిలో మూడుసార్లు పిచికారి చేయాలి.

మెగ్నీషియం: ఈ దాతువు లోపం ఎక్కువగా సున్నపు నేలల్లో, పొటాష్ ఎక్కువగా ఉన్న నేలల్లో పండించే పంటలో కనిపిస్తుంది. మెగ్నీషియం లోపం పత్తిలో ఎక్కువగా ఉంటుంది. మెగ్నీషియం లోపం ఉన్నప్పుడు ముదురు ఆకులు అంచుల నుంచి మధ్య భాగానికి పసుపు రంగులోకి మారుతాయి. ఆకుల ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉంటాయి. ఆకులు ఎర్రబారి ఎండిపోయి రాలిపోతాయి.

నివారణ చర్యలు: మెగ్నీషియం లోపిస్తే లీటరు నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి 45, 75 రోజులకోసారి పిచికారి చేయాలి. ప్రధాన పోషకాలు నత్రజని, పాస్పరస్, పొటాష్‌లు రైతులు ఏదో ఒక రూపంలో అందించాలి. దాని కంటే అధిక మోతాదులో వినియోగిస్తున్నారు. సూక్ష్మ పోషకాల ఆవశ్యకత తెలియక రైతులు పురుగుమందులు వాడుతున్నారు. రైతులు వారి స్థాయిలో లోపాల లక్షణాలు గుర్తించి అన్ని ఎరువులు సమపాళ్లో వాడితే పెట్టుబడి తగ్గి దిగుబడిని పెంచుకోవచ్చు.

శరన్నవరాత్రుల్లో పలు సేవలు రద్దు

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శ్రీ శారదీయ శరన్నవరాత్రుల సందర్భంగా పలు సేవలు రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 11 వరకు అభిషేకం, 9న అక్షరాభ్యాసములు తప్ప మిగతా అర్జిత సేవలు, వీఐపీ పాసులు, 11 నుంచి 13 వరకు చండీహోమం, 12న పూర్ణ హారతి, తదుపరి అభిషేకాలు రద్దు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. భక్తులు సహకరించగలరని వారు కోరారు.

రేకుల షెడ్లు కూల్చివేత



షెడ్లను కూల్చివేసిన దృశ్యం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని చున్నంబట్టివాడలో గల ఉమర్‌మియా సొసైటీలో నిర్మించిన ఐదు రేకులషెడ్లను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. సొసైటీకి సంబంధించిన భూవివాదాల కారణంగా రెండు వర్గాలకు చెందిన వారు కోర్టుకు వెళ్లారు. ఈక్రమంలో రేకుల షెడ్లను కూల్చివేసిన సంఘటన కలకలం రేపింది. రాత్రి వేళ కూల్చివేతల వెనుక రెండు వర్గాల్లో ఎవరైనా ఉన్నారా, లేక ఇతరుల ప్రమేయం ఉందా లేదాని తెలియాల్సి ఉంది. కూల్చివేతలకు సంబంధించిన సమాచారం తెలియదని అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేత



ప్రాజెక్ట్ నుంచి గోదావరిలోకి నీటిని విడుదల

మంచిర్యాలరూరల్(హాజీపూర్) మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లఎత్తివేత కొనసాగుతోంది. 20 గేట్లను ఎత్తి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు 147.95 మీటర్ల నీటిమట్టం ఉండగా, మొత్తం 20.175 టీఎంసీలకుగాను 20.100 టీఎంసీల నీటిలు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో కింద ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 1.35 లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తోందని తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 300 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, 20 గేట్ల నుంచి 1.30 లక్షల క్యూసెక్కులు గోదావరికి విడుదల చేస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పోలీసుల అత్యుత్సాహం

- ఒకరిపై లాఠీ ఝులిపించిన పోలీసులు
- జిల్లా కేంద్రంలో ఘటన

మంచిర్యాలక్రైం: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించిన ఘటన జిల్లాకేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గౌతమినగర్‌కు చెందిన ఎండీ సాబీర్.. రంగంపేటలో ఎలక్ట్రీషియన్ వర్క్ చేసి ఆదివారం సాయంత్రం బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. బైపాస్‌రోడ్‌లో రాత్రి పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సాబీర్ రాగా, పోలీసులు ఆపే ప్రయత్నం చేశారు. ఆయన ఆగకుండా ముందుకెళ్లగా కానిస్టేబుల్ లాఠీని అడ్డుపెట్టగా అతని గొంతుకు తగిలి కింద పడిపోయాడు. సాబీర్‌ను పైకి లేపి లాఠీ ఝులిపించారు. స్థానికులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై సురేష్‌ను వివరణ కోరగా, లాఠీని అడ్డం పెట్టలేదు. చెయ్యితో ఆపేందుకు ప్రయత్నం చేయగా కిందపడి పోయాడని తెలిపారు.